

ఉష్ణోగ్రత : గరిష్ఠం 37.8 కనిష్ఠం 19.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:34 (ఆదివారం సాయంత్రం)
సహర్: 4:55 (సోమవారం ఉదయం)

వర్షపాతం వివరాలు మిల్లీమీటర్లలో..

రంగారెడ్డి జిల్లా

సెంట్రల్ యూనివర్సిటీ	54.5
మాదాపూర్	48.8
రాజేంద్రనగర్	47.5
గచ్చిబౌలి	45.8
శేరిలింగంపల్లి	35.5
హఫీజ్‌పేట	35.5
మియాపూర్	23.0
కందుకూరు	27.8
యాచారం	24.0
షాబాద్	23.0
మంచాల	20.3
శంకర్‌పల్లి	14.5
మొయినాబాద్	12.3

వికారాబాద్ జిల్లా..

ధారూరు	23.3
పూడూరు	17.5
బషీరాబాద్	16.8
తాండూరు	16.3
మర్పల్లి	15.8
యాలాల	15.5
వికారాబాద్	15.3
నవాబుపేట	14.5
మోమిన్‌పేట	11.5
బంట్వారం	11.3
పరిగి	10.5

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా

కూకట్‌పల్లి	50.8
కీసర	47.8
కాప్రా	38.8
కుత్బుల్లాపూర్	37.8
అల్వాల్	35.8
బాలానగర్	33.0
మల్కాజిగిరి	31.5
శామీర్‌పేట	12.3
ఘట్‌కేసర్	08.5



శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురం ఫ్లైఓవర్ కింద నిలిచిన వరదనీరు

దంచికొట్టిన వాన

ఉమ్మడి జిల్లాలో అకాల వర్షాలు

- అక్కడక్కడ కురిసిన వడగండ్ల వాన
- నగర శివార్లలో ఉప్పొంగిన రోడ్లు
- జీవన్గిలో కూలిన ఇల్లు, షాబాద్‌లో పంట నష్టం
- దెబ్బతిన్న పూల తోటలు, కూరగాయ పంటలు
- శేరిలింగంపల్లిలో అత్యధిక వర్షపాతం నమోదు
- మరో రెండు రోజుల పాటు వర్ష సూచన
- ఎండల నుంచి ప్రజల ఉపశమనం

తీవ్రమైన ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు అకాలవర్షం ఉపశమనం కలిగించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి, శనివారం కురిసిన వర్షాలతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో పలు చోట్ల వడగండ్లతో పడిన వానలకు కొంత నష్టం వాటిల్లింది. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గిలో ఓ ఇల్లు పూర్తిగా కూలింది. అలాగే రంగారెడ్డి జిల్లా షాబాద్‌లోని పలు గ్రామాల్లో పంట నష్టం వాటిల్లింది. శేరిలింగంపల్లి మండలం సెంట్రల్ యూనివర్సిటీలో 54.5 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. నగర శివార్లలో మోస్తరు నుంచి భారీ వర్షం కురవగా మిగతా చోట్ల చిరుజల్లులు కురిశాయి.

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి): ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఎండలు ఠారెత్తిస్తున్న విషయం తెలిసిందే. మార్చిలోనే 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఉక్కబోతలతో జనం అల్లాడిపోయారు. అయితే శుక్రవారం రాత్రి అకస్మాత్తుగా కురిసిన వర్షం, చల్లటి గాలులతో ప్రజలు సేదదీరారు. మరో రెండు రోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, శనివారం గరిష్ఠ ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు

మిగతా 7వ పేజీలో...



షాబాద్ : సాయిరెడ్డిగూడలో ఈదురుగాలులకు నేలకొరిగిన పూలతోట



కందుకూరులో నీటమునిగిన కొత్తిమీర పంట

గళం విప్పిన ఎమ్మెల్యేలు

ఫ్యూచర్ సిటీలో ఆ 7 మండలాలూ కలపాలి



మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం, కందుకూరు, యాచారం, కడ్తాల్, ఆమన్‌గల్, ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల్లోని అన్ని గ్రామాలను విలీనం చేయాలని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అసెంబ్లీలో శనివారం ప్రస్తావించారు. కొంగరకలాన్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 300 ఫీట్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన అవసరం లేదన్నారు. శ్రీశైలం హైవే- నాగార్జున సాగర్ రోడ్డు లోపల భాగంలో ఇప్పటికే 200 ఫీట్ల రోడ్డు ఉండగా, మళ్లీ ఈ రోడ్డు వేయడం దేనికని ప్రశ్నించారు. అలాగే కొంగరఖుర్దు, తిమ్మాపూర్, తిమ్మాయిపల్లి తదితర గ్రామాల్లో 15 వేల ఎకరాలు సేకరించేందుకు మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

వందశాతం రుణమాఫీ చేయండి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



షాద్‌నగర్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వంద శాతం రైతు రుణమాఫీని చేయాల్సి ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ 90శాతం రైతులకు రుణమాఫీ పూర్తయిందని, మరో 10శాతం మిగిలిందన్నారు. రైతులు ఏ పార్టీకి సంబంధం లేనివారని, వారికి ఇచ్చిన మాట ప్రకారం వందశాతం రుణమాఫీ చేయడానికి పునఃసమీక్షించాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన అరకొర రుణమాఫీ వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడి అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీల మేరకు ఆదుకుంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' పనులెప్పుడు ప్రారంభిస్తారు?

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణానికి ఎన్ని నిధులు కేటాయించారు.. పనులను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలపాలని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి శాసన మండలిలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.23,370 కోట్లను కేటాయించామని చెబుతున్నా.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు ఎన్నినిధులు కేటాయించారో వివరించాలని కోరారు. అలాగే సర్పంచ్‌లు, కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. నమూన ప్రకారం ఇళ్లను నిర్మిస్తే రూ.10 లక్షల వరకు ఖర్చు వస్తుందని, ప్రభుత్వం రూ.5లక్షలు మాత్రమే ఇస్తే ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. కొందర్గు మండల కేంద్రం సమీపంలో సీఎం శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు ఎప్పుడు ప్రారంభిస్తారో చెప్పాలన్నారు.



శంషాబాద్‌లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

రెండో రోజూ ప్రశాంతం

'పది' పరీక్షలకు 99.37 శాతం మంది విద్యార్థుల హాజరు

రంగారెడ్డి అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 249 పరీక్ష కేంద్రాల్లో 51,746 మంది విద్యార్థులకు గాను 51,241 మంది హాజరయ్యారు. 325 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99.37 హాజరు శాతం నమోదైంది. అదేవిధంగా 15 మంది ప్రైవేట్‌గా పరీక్ష రాయాల్సి ఉండగా 10 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

శంషాబాద్ : టెన్త్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. శంషాబాద్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ప్రశ్నాపత్రాలు, రికార్డులు, వసతుల కల్పనను పరిశీలించారు. సెంటర్ల వద్ద ఓఆర్ఎస్, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

జిల్లా భూగర్భ జలవనరుల అధికారి మాధవరావు



ప్రతిజ్ఞ చేస్తున్న మాధవరావు, యుగేందర్‌రెడ్డి, సంగీత

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని జిల్లా భూగర్భజల అధికారి ఎస్.మాధవరావు, హైడ్రో జియాలజిస్టు యుగేందర్‌రెడ్డి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని ప్లాంట్ లిపిడ్స్ ఇండస్ట్రీ సహకారంతో పీఆర్‌డీపీ, ఎస్‌జీవో ఆధ్వర్యంలో తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా చెట్లను నరకడం మానుకోవాలన్నారు. ఒక చెట్టును నరికితే.. మరో ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఇంటి ఆవరణ, వ్యవసాయ క్షేత్రాలు, పరిశ్రమల్లో వాననీటి సంరక్షణ నిర్మాణాలు, ఇంకుడు గుంతలు, పాంపాండ్స్‌లను నిర్మించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా నీటి సంరక్షణపై కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. అధికారి సంగీత, ప్లాంట్ లిపిడ్స్ ఇండస్ట్రీ జీఎం మార్షల్, కార్మికులు పాల్గొన్నారు.

మాతృభాష ఉర్దూ.. తెలుగు భాషకు పట్టం

ఆయన మాతృభాష ఉర్దూ.. అయినా తెలుగు భాషపై ఎనలేని అభిమానం. తన రచనల ద్వారా సమాజానికి తన శక్తి మేరకు సందేశం ఇవ్వాలన్న కోరిక ఆయనను రచయితగా మార్చింది. ఒక వైపు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తూనే, మరోవైపు తెలుగుపై ఉన్న మమకారంతో పలు రచనలతో ప్రముఖుల ప్రశంసలు అందుకుంటున్నారు ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఉస్మాన్ అలీ. ప్రస్తుతం పరిగి మండలం మిట్టకోడూరు ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.

Sunday Special

- రచనల్లో రాణిస్తున్న ఉస్మాన్‌అలీ
- పాఠ్యపుస్తకాల విషయ నిపుణుడిగా గుర్తింపు



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయుడు ఉస్మాన్‌అలీ

పరిగి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఉస్మాన్‌అలీకి తెలుగు అంటే ప్రాణం. పరిగి మండలం ఖుదావంద్‌పూర్‌కు చెందిన ఆయన ఎంఏ, బీఈడీ అర్హతతో 1998లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. టీచర్‌గా కొనసాగుతూ రాజనీతిశాస్త్రంలో పీజీ పూర్తి చేశారు. ఆ తర్వాత తెలుగుపై ఉన్న ఆసక్తి, మమకారంతో ఎంఏ తెలుగులో పట్టా పొందారు. రాజీవ్ విద్యామిషన్‌లో వారు విద్యార్థుల కోసం ప్రచురించిన బాల సాహిత్యం పుస్తకాల్లో ఆయన అనేక రచనలు చేశారు. 2010 నుంచి రాజీవ్ విద్యామిషన్ వారు ప్రచురిస్తున్న చింతచిగురు మాసపత్రికకు విషయ నిపుణులుగా పని చేశారు. ప్రస్తుతం కూడా ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో సబ్జెక్టులకు సంబంధించి విషయ నిపుణుడిగా పని చేస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 80 వరకు

మిగతా 7వ పేజీలో...



గోదామును పరిశీలిస్తున్న డీఏవో నర్సింహారావు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు

ఆమన్‌గల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తనాల దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటింకపోతే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయశాఖ అధికారి నర్సింహారావు తెలిపారు. ఈ పాస్ ద్వారానే వాటిని విక్రయించాలని, విధిగా రైతులకు రసీదులు ఇవ్వాలని సూచించారు. తలకొండపల్లి మండల కేంద్రం, పడకల్, వెల్జాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాములను ఆయన శనివారం సందర్శించారు. యూరియా నిలువలు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. వచ్చే వానకాలం పంటల సాగుకు జిల్లా వ్యాప్తంగా సమగ్ర వ్యవసాయ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ శోభారాణి, ఏవో చక్రవర్తి తదితరులు ఉన్నారు.

హెచ్‌ఆర్‌ఏ 24 శాతానికి పెంచాలి

గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామారావు



మాట్లాడుతున్న డాక్టర్ రామారావు

రంగారెడ్డి అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 24 శాతానికి పెంచాలని జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ కె. రామారావు డిమాండ్ చేశారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న కలెక్టరేట్ లక్డికాపూల్‌లో అందరికీ అందుబాటులో ఉండేదని, అప్పుడు ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ 24 శాతం వచ్చేదని తెలిపారు.. కొంగరకలాన్‌కు మారడంతో హెచ్‌ఆర్‌ఏ 11 శాతం అయ్యిందన్నారు. పెండింగ్ బిల్లులు, నాలుగు డీఏలు వెంటనే విడుదల చేయాలని, గెజిటెడ్ అధికారుల సభ్యత్వ నమోదును వచ్చేనెలలో పూర్తి చేయాలని సమావేశంలో తీర్మానించారు. అలాగే పీఆర్సీని వెంటనే ప్రకటించి అమలు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలన్నారు. జిల్లా అసోసియేషన్ కార్యక్రమాలకు కలెక్టరేట్‌లో హాల్ కేటాయించాలని, జిల్లా గెజిటెడ్ అధికారుల హౌసింగ్ సొసైటీ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అసోసియేట్ అధ్యక్షుడు వీసీ వెంకటేష్, కార్యదర్శి శ్రీనేష్ కుమార్, ఉపాధ్యక్షుడు గంపా శ్రీనివాస్, నాయకులు వెంకట్, రేవతి, అలివేలు, బాలరాజు, లక్ష్మణ్‌స్వామి, అనిత, మహేశ్వరి, సుజాత, శ్రవణ్‌కుమార్, రాకేష్, సైదమ్మ, శాంతిశ్రీ, మంజునాయక్ పాల్గొన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

ఆమనగల్లు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ యంత్రపనిముట్లు అందజేస్తామని ఆమనగల్లు ఏడీఏ కె.శోభారాణి శనివారం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు ఈ పనిముట్లు ఇస్తున్నట్లు చెప్పారు.

మాతృభాష ఉర్దూ.. తెలుగు భాషకు పట్టం


ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి మంత్రి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డిల నుంచి సన్మానం అందుకున్న ఉస్మాన్ అలీ

(ఐదో పేజీ తరువాయి)

తెలుగులో కవితలు, పాటలు, వ్యాసాలను రచించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు పాఠ్యపుస్తకాలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణకు రిసోర్స్‌పర్సన్‌గా పని చేశారు. ఆయన మాతృభాష ఉర్దూ అయినా.. హిందువులు పవిత్రంగా చెప్పుకునే 'కార్తీక మాసం' ప్రత్యేకపై రాసిన వ్యాసం చింతచిగురు మాసపత్రిలో ప్రచురితమైంది.

కలెక్టర్ ప్రశంసలు

కులం లేదు, మతం లేదు మన అందరిదీ మానవకులం అంటూ లౌకిక తత్వంపై రచించిన కవిత బాలసాహిత్యం 'చిరుదీపాలు' ప్రచురితమైంది. ఉస్మాన్ 2013లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అప్పటి మంత్రి ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్సీ నరేందర్‌రెడ్డిల నుంచి సన్మానం అందుకున్నారు. 2017లో ప్రపంచ తెలుగు మహాసభల్లో నిర్వహించిన కవితా పోటీల్లోనూ ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. అజీమ్‌ప్రేమ్‌జీ యూనివర్సిటీలో ఎర్లీ లిటరసీ ప్రోగ్రాంలో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా పనిచేశారు. 2023లో వికారాబాద్ కవి సమ్మేళనంలో నాటి కలెక్టర్ నారాయణరెడ్డి నుంచి ప్రశంసలందుకున్నారు. హిందువుల దైవ కార్యక్రమాల్లో భాగస్వాములవుతారు.

రచించిన కవితలు, పాటలు

గురువు, భారత జాతి, చెప్పింది వినండి, ఎలుక.. ఓ చిట్టెలుక, ఆదర్శం, అమ్మ-బొమ్మలు, దోమ.. ఓ దోమ, తెలుగు భాష, డైరీపాట, పిల్లలం.. పసిపిల్లలం, బావా డిగికోస్తావా, స్నేహం, చిన్న పిల్లలం.

వ్యాసాలు: గురుపూజోత్సవం, సయ్యద్‌పల్లి దర్గా, అబ్దుల్లా హుస్సేని చిస్తి మిర్జాయి దర్గా, కార్తీకమాస ప్రత్యేకత, మొహ్రం చిట్టివ్యాసం, జాతీయ చిహ్నం, తెలంగాణ పాటలు.. ఇలా అనేక రచనలు చేశారు.

జీవోలు తెలుగులోనే ఇవ్వాలి

తెలుగుభాషాభివృద్ధి జరగాలి. ఏటా తెలుగు మహాసభలు నిర్వహించాలి. అలాగే ప్రభుత్వ జీవోలు, ఉత్తర్వులన్నీ తెలుగులో ఇవ్వాలి. సాహితీ ప్రియులు, తెలుగుభాషాభిమానులు, ప్రభుత్వం సహకరిస్తే పిల్లల పాటలు, విద్య విషయ సూచిక పుస్తకాలు రచించేందుకు ఆసక్తిగా ఉన్నాను.

- ఉస్మాన్ అలీ

దంచికొట్టిన వాన

(ఐదో పేజీ తరువాయి)

డిగ్రీలు తగ్గాయి. దాదాపు అన్ని మండలాల్లో 19 నుంచి 22 డిగ్రీల మధ్య కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శని వారం రాత్రి కూడా పలు చోట్ల చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది.

పలు చోట్ల మోస్తరు వర్షం

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలోని లింగారెడ్డిగూడ, దామర్లపల్లి, సాయిరెడ్డిగూడ, నాందర్‌ఖాన్‌పేట్, పెదవేడు, మద్దూర్, హైతాబాద్, సోలిపేట్, నాగర్‌కుంట తదితర గ్రామాల్లో పంట నష్టం జరిగింది. కూరగాయ పంటలు, పూల తోటలు దెబ్బతిన్నాయి. లింగారెడ్డిగూడలో ఓ ఇల్లు కూలింది. భారీ వర్షానికి శంకర్‌పల్లి మున్సిపాలిటీలోని ఫత్తేపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు చేరింది. దీంతో శనివారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉంటే శనివారం రాత్రి కూడా పలు చోట్ల చిరుజల్లులతో కూడిన వర్షం కురిసింది. ఇబ్రహీంపట్నం, కందుకూరు, మంచాల, యాచారం, మోమిన్‌పేట, నవాబుపేట మండలాల్లో మోస్తారు వర్షాలు కురుస్తున్నాయి. యాచారం మండలం కుర్మిద్ద, నజ్దిక్ సింగారం గ్రామాల్లో వడగళ్లు పడ్డాయి. పంట నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కొద్ది రోజులుగా తీవ్ర ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలకు అకాల వర్షంతో ఉపశమనం కలిగింది.

మారథాన్ విజేతగా సంస్కృతి ఇంజినీరింగ్ కాలేజీ బృందం



బహుమతులు అందుకుంటున్న కాలేజీ విద్యార్థులు

ఘట్‌కేసర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పరిధి సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు కోడ్ ఉన్నతి, ఇన్నోవేషన్ మారథాన్‌లలో గ్రాండ్ విజేతలుగా నిలిచారు. ఇటీవల హైదరాబాద్‌లో టాస్క్ కార్యాలయంవద్ద శాప్ ఇండియా ఎడ్యుకేషన్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 15కాలేజీలు, టాస్క్ సెంటర్ నుంచి 1,500మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారని కాలేజి డైరెక్టర్ మాల్లాడి రమాకాంత్‌రెడ్డి శనివారం తెలిపారు. సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాల టాప్ టెన్‌లో స్థానం దక్కించుకోగా, ఒక బృందం గ్రాండ్ విజేతగా నిలిచిందన్నారు. మొదటి బృందం సభ్యులు అల్ హెల్త్ డయాగ్నస్టిక్ ప్లాట్‌ఫామ్ అనే ప్రాజెక్టు, రెండో బృందం 'వీడియో ట్రాన్‌స్క్రిప్ట్ సమ్మరైజర్' అనే సాధనాన్ని రూపొందించారని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌ల సాంకేతిక నైపుణ్యానికి ప్రశంసలు లభించాయన్నారు. విజేతలకు పరిశ్రలు, ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారని వివరించారు.

పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న సీఎం


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకుడు వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు నిరుపేదల సొంతింటి కలను నిజం చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్ అన్నారు. శనివారం శామీర్‌పేట మండలం పొన్నాల్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్ గౌడ్ ఆధ్వర్యంలో వజ్రేష్‌యాదవ్ ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గూడు లేని పేద, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తారని చెప్పారు. ప్రజా సంక్షేమానికి మునుపెన్నడూ లేని విధంగా పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనని అన్నారు. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని వజ్రేష్‌యాదవ్ చెప్పారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు సాయిపేట శ్రీనివాస్, గడ్డం రమేశ్, దోసకాయల వెంకటేశ్, బత్తుల కిశోర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి, పార్టీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పించేలా కార్యాచరణ ఉండాలి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణిచ్చి, వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా అధికారులు కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి స్కిల్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ అధ్యక్షతన 16మంది సభ్యులతో జిల్లా స్థాయి కమిటీ ఏర్పాటు చేశారన్నారు. నిరుద్యోగులకు నైపుణ్య శిక్షణ అందించేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. చిన్న పరిశ్రమల స్థాపన, స్టార్టప్ కల్చర్, స్టాండప్ ఇండియా, స్టార్టప్ ఇండియా వంటి పథకాలపై అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థలు, ఆర్మీ, బ్యాంక్ రిక్రూట్మెంట్ వివరాలను యువతకు తెలియజేసి ఉద్యోగాలు సాధించేలా శిక్షణివ్వాలని ఆదేశించారు. సమావేశంలో ఎంప్లాయ్‌మెంట్ అధికారి అబ్దుల్‌సుభాన్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అధికారులు మల్లేశం, కమలాకర్‌రెడ్డి, డీఏవో మోహన్‌రెడ్డి, స్పోర్ట్స్ అధికారి హన్మంతరావు పాల్గొన్నారు.

ఉద్యాన రైతులను ఆదుకుంటాం


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కూరగాయలు, పండ్ల తోటల రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రంగారెడ్డి జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్ అన్నారు. శనివారం చౌదర్‌పల్లి రైతు వేదికలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్‌ను వందశాతం రాయితీతో ఇస్తామన్నారు. సన్న, చిన్నకారు రైతులకు 90శాతం, ఇతర రైతులకు 80శాతం రాయితీ వర్తింపజేస్తున్నట్లు చెప్పారు. చౌదర్‌పల్లి, గడ్డమల్లయ్యగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద తీసుకొని రైతులను ఆదుకుంటామని చెప్పారు. పవర్ టిల్లర్లు, డ్రోన్లు, మల్చింగ్ తదితర వసతులు కల్పిస్తామని తెలిపారు. కోతుల బెడద నివారణపై అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. సోలార్ పవర్ వినియోగానికి రైతులు చొరవ తీసుకోవాలన్నారు. పందిరి సాగుకు రాయితీకి చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరానికి కూరగాయలు, ఆకు కూరలు రవాణా చేసి ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. ఇదిలా ఉంటే అడవి పందులు, జింకల బెడద నివారణకు రాయితీపై సోలార్ ఫెన్సింగ్ యూనిట్లు మంజూరు చేయాలని రైతులు పీడీ సురేష్‌ను కోరారు. ఇందుకాయన సానుకూలంగా స్పందించారు. సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ ఏడీ అరుణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు భేష్


ఆస్పత్రిని పరిశీలిస్తున్న కాయకల్ప వైద్య బృందం

షాద్‌నగర్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో సదుపాయాలు భేష్‌గా ఉన్నాయని కాయకల్ప బృందం కితాబిచ్చింది. శనివారం షాద్‌నగర్‌లోని కమ్యూనిటీ ఆస్పత్రిని బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందం సభ్యులు వైప్రజ్ఞారెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిటీ ఆస్పత్రిలో రోగులకు అందజేస్తున్న చికిత్సలు, సేవలపై సంతృప్తి వ్యక్త చేశారు. ఆస్పత్రిలో శానిటేషన్, రోగుల పట్ల సిబ్బంది ప్రవర్తన కూడా బాగున్నాయన్నారు. ఆస్పత్రి పర్యవేక్షణాధికారి శ్రీనివాస్‌రెడ్డిని అభినందించారు.

నాపరాతి వ్యర్థాలు రోడ్డుపక్కనేస్తే చర్యలు


గౌతాపూర్-కరన్‌కోట్ రోడ్డు పక్కన పారబోసిన నాపరాతి ముక్కలు

తాండూరు రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నాపరాతి వ్యర్థాలను రోడ్డుపక్కన పారబోస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి హెచ్చరించారు. గౌతాపూర్ శివారులోని గోపన్‌పల్లి గ్రామాల నాపరాతి పాలిషింగ్ యూనిట్ నుంచి వెలువడుతున్న నాపరాతి వ్యర్థాలను అబ్దుల్ హజీజ్ అనే వ్యక్తి రోడ్డుకు ఇరువైపులా పారబోస్తున్నారని గౌతాపూర్ పంచాయతీ కార్యదర్శి ఫక్రోజీ ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ శనివారం తెలిపారు. ఈ వ్యర్థాలతో గౌతాపూర్-కరన్‌కోట్ రోడ్డులో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రణహానికి దారిస్తుందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు చెప్పారు. పాలిషింగ్ యూనిట్ల యజమానులు వ్యర్థాలను రోడ్డు పక్కన పారబోస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు. ఇప్పటికే వేసిన వ్యర్థాలను యజమానులతో తీయిస్తామని ఎస్సై తెలిపారు.

పరిగి లాయర్‌కు 'సుప్రీం'లో సన్మానం



విశాలను సన్మానిస్తున్న రిటైర్డ్ సీజే కేజీ.బాలకృష్ణన్

పరిగి,మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పరిగి కోర్టు బార్ అసోషియేషన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది అందె విజయ్‌కుమార్ కూతురు అందె విశాల హైకోర్టు, సుప్రీం కోర్టుల్లో ప్రాక్టీస్ చేస్తున్నారు. చిన్న వయసులోనే సుప్రీం కోర్టు ఆల్ ఇండియా బార్ అసోషియేషన్‌లో సభ్యత్వం తీసుకుని అక్కడే ప్రాక్టీస్ చేస్తున్నాయి. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఢిల్లీలో సుప్రీం కోర్టు హాల్‌లో రిటైర్డ్ సీజే కేజీ.బాలకృష్ణన్, ఇతర జడ్జిలు, న్యాయవాదుల చేతుల మీదుగా సన్మానాన్ని అందుకున్నారు. సన్మానాన్ని అందుకోడం సంతోషంగా ఉందని న్యాయవాది విశాల తెలిపారు.

మోకిల సీఐ వీరబాబుకు రివార్డు


రివార్డు అందుకుంటున్న సీఐ వీరబాబు

శంకర్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మోకిల సీఐ వీరబాబు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి నుంచి రివార్డు అందుకున్నారు. కమిషనరేట్‌లో శనివారం సీపీ నుంచి రివార్డు అందుకున్నారు. మీర్జాగూడ అనుబంధ గ్రామం ఇంద్రారెడ్డినగర్‌లో 2024లో ఏప్రిల్‌లో భార్యను భర్త హత్య చేసిన ఘటనలో ఎఫ్ఐఆర్ నమోదు చేసి చార్జిషీట్ వేశారు. 2025 ఫిబ్రవరిలో నిందితుడికి జీవిత ఖైదు పడింది. కేసును ఛేదించడంలో వీరబాబు కృషిని గుర్తిస్తూ సీపీ, అడిషనల్ సీపీ గజరావు భూపాల్‌లు సీఐని ప్రత్యేకంగా అభినందించి రివార్డు అందజేశారు.

మహేశ్వరాన్ని ఫ్యూచర్ సిటీలో కలిపేందుకు కృషిచేస్తా


కేఎల్లార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు

మహేశ్వరం, మార్చి22(ఆంధ్రజ్యోతి):మహేశ్వరం మహానగరంగా మారాలంటే దాన్ని ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాలన్న జేఏసీ విజ్ఞప్తిని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. ఫ్యూచర్‌సిటీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కేఎల్లార్, ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డిలను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. వారితో కేఎల్లార్ మాట్లాడుతూ.. భవిష్యత్తు బాగుండాలంటే మహేశ్వరం, కందుకూరు మండలాలను పూర్తిగా ఫ్యూచర్‌సిటీలో విలీనం చేయాల్సి ఉంటుందన్నారు. ఇదే విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్తానన్నారు. మహేశ్వరం రానున్న రోజుల్లో మహానగరంగా మారబోతోందన్నారు. ప్రభుత్వ పెద్దలతో తనకున్న పరిచయాలతో తాను మహేశ్వరాన్ని ఫ్యూచర్‌సిటీలో విలీనం చేసేంత వరకు పోరాటం చేస్తానని జేఏసీ నాయకులకు కేఎల్లార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫ్యూచర్‌సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి, గౌరవాధ్యక్షుడు మనోహర్, వి.మల్లేష్‌యాదవ్, ముఖ్య సలహాదారులు కడారి జంగయ్యయాదవ్, యాదగిరిరెడ్డి, కట్టెగొమ్ముల జగన్‌రెడ్డి, చంద్రయ్య, అంద్యానాయక్, సుదర్శన్‌యాదవ్, సుదర్శన్‌రెడ్డి, కాకి ఈశ్వర్, రవికుమార్, బి.నర్సింహయాదవ్, దత్తునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లతోనే భవిష్యత్తు

ఆదిభట్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నీటిని అత్యంత పొదుపుగా వాడుకోవాలని, నీరు లేకపోతే భవిష్యత్తు లేదని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా భారత వ్యవసాయ ఇంజనీర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల మున్సిపల్ కొంగరకలాన్ పరిధిలోని శ్లోకా కన్వెన్షన్‌లో తెలంగాణ జల వనరులు, నీటి యాజమాన్యంపై శనివారం సదస్సు నిర్వహించారు. సదస్సులో జాతీయ అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తలతో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నీటిని విచక్షణా రహితంగా వాడకూడదని చెప్పారు. నీటిని వృథా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు పెరిగి సమస్యలు తప్పవని వక్తలు హెచ్చరించారు. సమర్థవంతమైన నీటి యాజమాన్యం కోసం రాబోయే రోజుల్లో పలు సంస్కరణలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సదస్సులో రైతు మార్గదర్శి పద్మశ్రీ చింతల వెంకటరెడ్డి, డాక్టర్ కె.ఎల్లారెడ్డి, నీటి యాజమాన్య నిపుణులు పీఆర్పీ సుందర్‌రావు తదితరుల పాల్గొన్నారు.


జల దినోత్సవ సదస్సులో చిన్నారెడ్డి, కోదండరెడ్డి, నిపుణులు

అభివృద్ధి పనులకు శ్రీకారం

తలకొండపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్జాల గ్రామ పరిధి ఇస్రాయిపల్లిలో శనివారం భూగర్భ మురుగు కాలువ నిర్మాణ పనులను ఆమనగల్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో రూ.5లక్షలతో పనులు చేపట్టినట్లు తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ అజీజ్, ఆరిఫ్, రాజు, విస్ను, రమేశ్, అఫ్తాబ్, శ్రీశైలం, వెంకటేశ్, జంగయ్య, కిరణ్, బాలకృష్ణ, సాయికిరణ్, బాలస్వామి, నరేశ్, లక్ష్మయ్య, రాములు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

గ్యారెంటీల అమల్లో ప్రభుత్వం విఫలం


షాబాద్‌లో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీలిచ్చి అధికారంలోకొచ్చిన కాంగ్రెస్ వాటిని అమలులో విఫలమైందని చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం, బీజేపీ నాయకులు కంజర్ల ప్రకాశ్, ప్రతాప్‌రెడ్డి, రాములుగౌడ్, ప్రభాకర్‌రెడ్డిలతో కలిసి షాబాద్‌లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో అమలవుతున్న పథకాలన్నీ కేంద్రానివే అన్నారు. ప్రతి రైతు కుటుంబానికి ఏడాదిలో కేంద్రం రూ.90వేల వరకు లబ్ధి చేకూరుస్తోందన్నారు. స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాణయ్య, శ్రీధర్‌రెడ్డి, పీసరి సతీష్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిరణ్, వెంకటేష్‌గౌడ్, హరీష్, సురేష్, మహేందర్, నారాయణ, జనార్దన్‌రెడ్డి, గోవర్దన్, విజయ్‌కుమార్, గణేష్, విష్ణు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం

కులకచర్ల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలన్నదే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని చేవేళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం కులకచర్లలోని బాలుర పాఠశాలలో భాగంగా జీకేఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మరుగుదొడ్ల శుభ్రపర్చేందుకు ట్రక్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మాటలు విని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రహ్లాద్‌రావు, అంజిలయ్య, ఈశ్వరయ్య, వెంకటయ్యగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, సౌమ్యారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, జానకిరామ్, గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేదునూరులో వేంకటేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నేదునూరులో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రథోత్సవాన్ని నిర్వహించారు. ధర్మకర్త, వేద పండితులు రామశర్మ ఆధ్వర్యంలో ఉదయం 6:30 నుంచి 10గంటల వరకు గ్రామ వీధుల్లో రథాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.రామక్రిష్టారెడ్డి, నాయకులు జి.శమమంతప్రభాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యాచారంలో తిరుమలేశుడి కల్యాణోత్సవం


అలంకరణలో స్వామి వారు

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యాచారంలోని తిరుమలేశునిగుట్టపై గల ఆలయంలో వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం కనుల పండువగా జరిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పూజలు చేసి మధ్యాహ్నం కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, బీఎన్‌రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మరోజు కళమలను నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

'భూ కబ్జాపై ప్రశ్నిస్తే కేసు బనాయిస్తున్నారు'

ఘట్‌కేసర్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రియల్టర్లు తమ భూమి కబ్జాచేసి ప్రశ్నిస్తున్న తమపై ఉల్టా కేసు పెడుతున్నారని కొర్రెములకు చెందిన గోపు బాల్‌రాజ్, ముంత శ్రావణ్, కృష్ణ, బాలకృష్ణ, నాగేష్, రమేష్ ఆరోపించారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. 60యేళ్ల క్రితం కొర్రెములలోని సర్వే నంబర్లు 402, 396, 395, 394, 387లలోని 11ఎకరాల 2గుంటల భూమిని కొని సాగుచేస్తున్నట్టు చెప్పారు. ఈ భూమి పార్టీషన్ కాలేదని, అందరం కలిసే సాగు చేస్తున్నామని తెలిపారు. కాగా ఇందులో ఇద్దరు పట్టాదారులు మెట్టు సత్తయ్య, ముంత మల్లేష్ రెండెకరాల 10గుంటల భూమిని మణదీప రియల్ ఎస్టేట్ సంస్థకు అమ్మారన్నారు. సదరు సంస్థ 2ఎకరాల 10గుంటలకు బదులు 2ఎకరాల 20గుంటలను కబ్జాచేసిందన్నారు. ఇదేందని అడిగితే తమపై కేసులు పెడుతున్నారని వాపోయారు. డప్పోనివాగు, ప్రభుత్వ భూమినీ కబ్జా చేస్తున్నారని కలెక్టర్, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు పట్టించుకోవడం లేదన్నారు.

పార్టీ పటిష్టతకు పనిచేద్దాం : రాజ్‌భూపాల్‌గౌడ్


రాజ్‌భూపాల్ గౌడ్‌ను సన్మానిస్తున్న బుక్క వేణుగోపాల్

శంషాబాద్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి):బీజేపీ పటిష్టతకు అందరం పని చేద్దామని బీజేపీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్‌గౌడ్ అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయనను శనివారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బుక్క వేణుగోపాల్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ టి.శ్రీనివాస్‌రెడ్డి శాలువాలు కప్పి సత్కరించారు. ఆయన మాట్లాడుతూ.. పార్టీ బలోపేతమే తన లక్ష్యమని, నాయకులంతా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి కుమార్‌యాదవ్, నర్కూడ మాజీ సర్పంచ్ సిద్ధులు, సంజీవ, గోపాల్, నగేష్‌గౌడ్, కుమార్, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి : ఎంపీడీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న చోట తాగునీరు, మెడికల్ కిట్లు, టెంట్లు తదితర వసతులు అందుబాటులో ఉంచాలని ఎంపీడీవో జి.నరేందర్‌రెడ్డి ఫీల్డ్ అసిస్టెంట్లను, ఇతర సిబ్బందిని ఆదేశించారు. 'కూలీల అనాసక్తి' శీర్షికన ఈ నెల 8న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి శనివారం ఎంపీడీవో స్పందించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో కూలీలకు కల్పిస్తున్న వసతులపై ఎంపీడీవో అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో పెట్టాలని, పని చేసే చోట నీడ కోసం టెంట్లు వేయించాలని ఆదేశించారు. మెడికల్ అధికారులతో మాట్లాడి ఫీల్డ్ అసిస్టెంట్లకు మెడికల్ కిట్లను ఇవ్వాలని సూచించినట్టు చెప్పారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

ప్రతి గ్రామంలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో నరేందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. పన్నుల వసూళ్లపై కలెక్టర్ సీరియస్‌గా ఉన్నారన్నారు. ప్రతి గ్రామంలో 500 నుంచి 600 మంది కూలీలకు ఉపాధి కల్పించాలని చెప్పారు. ఫామ్‌పాండ్ల నిర్మాణాలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కూలీలకు పని కల్పించని వారిని బదిలీ చెస్తామని చెప్పారు. త్వరలో జరిగే సోషల్ ఆడిట్‌కు రికార్డులు సిద్ధం చేసుకోవాలన్నారు. నిబంధనల మేరకు కూలీలకు పని కల్పించకుంటే మండలం రూ.కోటి మేర ఆదాయం కోల్పోతుందన్నారు. సమావేశంలో ఏపీవో లింగయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.

ఈదురు గాలులు.. వడగండ్ల వాన

- అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలు
- జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షం

కడ్తాల్/కందుకూరు/షాబాద్/చేవెళ్ల/శంకర్‌పల్లి/యాచారం/ఇబ్రహీంపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. కడ్తాల మండల కేంద్రంతోపాటు పరిసర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం వర్షం కురిసింది. అరగంటపాటు కురిసిన వానకు పలువురు రైతులకు చెందిన వరి, మామిడితోటలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వడగండ్ల వర్షంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. కొన్నిచోట్ల పంట పొలాల నిండా వడగళ్లే కనిపించాయి. ఈ ఏడాది మామిడి కాత అంతంత మాత్రంగానే ఉంది. వడగళ్ల వాన కారణంగా ఉన్న కొద్దిపాటి కాయలుకూడా నేలరాలాయని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కందుకూరు మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. సుమారు గంటపాటు కురవడంతో పలు గ్రామాల్లో కూరగాయ పంటలు దెబ్బతిన్నాయి. కొత్తగూడ, నేదునూరు, కందుకూరు, దెబ్బడగూడ, తదితర గ్రామాల్లో వడగండ్ల వాన కురిసింది. పలు గ్రామాల్లో రేకుల షెడ్లు, ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. మండల కేంద్రంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వర్షపు నీరు నిలువడంతో వాహదారులు ఇబ్బందులు పడ్డారు. షాబాద్ మండలంలో శుక్రవారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. లింగారెడ్డిగూడ, దామర్లపల్లి, సాయిరెడ్డిగూడ, నాందర్‌ఖాన్‌పేట్, పెదవేడు, మద్దూర్, హైతాబాద్, సోలిపేట్, నాగర్‌కుంట తదితర గ్రామాల్లో కూరగాయలు, పూలు తదితర పంటలు దెబ్బతిన్నాయి. లింగారెడ్డిగూడలో ఇంటిపై కప్పులు లేచిపోయాయి. శనివారం సాయంత్రం చేవెళ్ల మండలంలోని పలు గ్రామాల్లో అరగంట పాటు వర్షం కురిసింది. ఆలూర్‌లో వడగండ్ల వర్షం కురిసింది. ఎలాంటి నష్టం జరగలేదు. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి శంకర్‌పల్లి మున్సిపల్‌లోని ఫత్తేపురం ఫ్లైఓవర్ కింద భారీగా వరదనీరు చేరింది. శనివారం ఉదయం నుంచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ద్విచక్ర వాహనదారులు అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ పోలీసులు వాహనాలను పక్కనుంచి దారి మళ్లించారు. మున్సిపల్ కమిషనర్ యోగేష్, సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఆర్ అండ్‌బీ ఏఈ చంద్ర శేఖర్‌రెడ్డిలు బ్రిడ్జి వద్దకు చేరుకొని పరిశీలించారు. నీటిని మోటారు సాయంతో తీసివేస్తామని, త్వరలో సైడ్‌డ్రైన్ నిర్మించి శాశ్వతంగా సమస్య లేకుండా చూస్తామని ఏఈ తెలిపారు. అలాగే యాచారం మండలంలోని కుర్మిద్ద, నజ్దిక్ సింగారం గ్రామాల్లో శనివారం సాయంత్రం చెదురుమదురు వర్షంతో పాటు ఓ మోస్తరు వడగండ్ల వర్షం పడింది. కాగా, ఆ గ్రామాల్లో పంటలకు నష్టమేమీ జరగలేదు. అదేవిధంగా ఇబ్రహీంపట్నం టౌన్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో శనివారం సా యంత్రం తేలికపాటి వర్షం కురిసింది. అలాగే మాడ్గుల మండలంలో శనివారం సాయంత్రం కొద్దిసేపు కురిసిన వర్షానికి చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి.



కందుకూరు : పద్మావతినగర్‌లో కూలిన ప్రహరీ



కందుకూరు : గూడూరు గేటు వద్ద ఈదురు గాలులకు ఎగిరిపోయిన రేకులు



షాబాద్ : కుమ్మరిగూడలో వడగండ్ల వానకు రాలిన మామిడికాయలను చూపుతున్న రైతులు



కడ్తాలలో వడగండ్ల వాన

వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



కొందుర్గు మండల వైద్యాధికారి అమృతా జోసఫ్

ఫటా ఫట్

చౌదరిగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా వేసవిలో వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కొందుర్గు వైద్యాధికారి అమృత జోసఫ్ చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అనారోగ్యం బారినపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ప్రతీ ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని చెబుతున్న ఆమె ఆంధ్రజ్యోతితో పలు విషయాలు పంచుకున్నారు.

ప్రశ్న: వడదెబ్బ లక్షణాలను ఎలా గుర్తించవచ్చు?

జవాబు: తీవ్రమైన జ్వరం, దాహం, శరీరంపై దద్దులు, కండరాల తిమ్మిరి, వికారం, వాంతులు, తలనొప్పి, మూత్రం పసుపు పచ్చరంగులో రావడం, మూత్ర విసర్జన తగ్గిపోవడం, వేగవంతమైన శ్వాసవంటివి ఉన్నప్పుడు వడదెబ్బ లక్షణాలుగా గుర్తించవచ్చు. వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి.

ప్రశ్న: ఒకవేళ వడదెబ్బకు గురైతే ఏం చేయాలి?

జవాబు: రోగిని వెంటనే చల్లని ప్రదేశంలోకి తీసుకెళ్లి చల్లని నీరు లేదా కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ తాగించాలి. తడి గుడ్డతో శరీరాన్ని తడపాలి. 15 నిమిషాల్లో రోగి కోలుకోకపోతే వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

ప్రశ్న: వడదెబ్బకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: ఎండల తీవ్రత కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 3గంటల మధ్య బయటికి వెళ్లకూడదు. ఎండలో కఠినమైన పనులు చేయకూడదు. ఉదయం, సాయంత్రం నాలుగు గంటల తర్వాత వాతావరణం చల్లబడుతుంది. మధ్యాహ్నం బయటకు వెళ్లకూడదు. తప్పని పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే గొడుగు తీసుకెళ్లాలి.

ప్రశ్న: ఎలాంటి ఆహారం తీసుకోవాలి?

జవాబు: వేసవిలో కూరగాయాలు ఎక్కువడా ఉండే ఆహారం మంచిది. తగినంత మంచినీరు, పండ్లు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, పాలు, లస్సీ, ఓఆర్ఎస్ వంటివి తీసుకోవాలి. అదేవిధంగా బయట దొరికే చిరుతిళ్లు ఎక్కువగా తీసుకోకూడదు.

ప్రశ్న: ఎండాకాలం ఎలాంటి దుస్తులు ధరించాలి?

జవాబు: వేసవిలో మెత్తని, పలుచగా ఉండే కాటన్ దుస్తులను ధరించాలి. బిగుతుగా ఉండేవి అస్సలు వేసుకోకూడదు. తెలుపు రంగు దుస్తులు వాడితే చాలా మంచిది. బయటికి వెళ్లినప్పుడు గొడుగు, టవల్, టోపీ తీసుకెళ్లాలి. గర్భిణీలు, వృద్ధులు, చిన్నపిల్లలు, బీపీ, షుగర్ ఉన్నవారు ఖచ్చితంగా జాగ్రత్తలు పాటించాలి.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి



బోరును ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్‌యాదవ్

కొత్తూర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవిని నేపథ్యంలో మున్సిపాలిటీలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్యదేవేందర్‌యాదవ్ తెలిపారు. మున్సిపాలిటీలోని తిమ్మాపూర్ 3వ వార్డులో రూ.లక్ష నిధులతో ఏర్పాటు చేసిన బోరుమోటార్‌ను శనివారం చైర్‌పర్సన్ ప్రారంభించారు. కమిషనర్ బాలాజీ, వైస్‌చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, చంద్రకళరాజేందర్‌గౌడ్, సోమ్లనాయక్, మాజీ సర్పంచ్ ఏనుగు జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేందర్‌గౌడ్, నాయకులు యాదయ్య, జె.శ్రీను, గోపాల్‌గౌడ్, కృష్ణయ్య, అల్విన్‌రెడ్డి, భాస్కర్, నాగరాజు, మాధవరెడ్డి, కోస్గి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌పీసీ మెంబర్‌గా జగన్

ఆమన్‌గల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మెంబర్‌గా మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లికి చెందిన సుప్రీంకోర్టు న్యాయవాది, తెలంగాణ ప్రజారోగ్య బాధితుల సంఘం అధ్యక్షుడు యు.జగన్ నియమితులయ్యారు. ఢిల్లీలో శనివారం జరిగిన ఓ కార్యక్రమంలో కమిషన్ సభ్యులతో కలిసి ఢిల్లీ పోలీస్ ఆఫీసర్ కిరణ్‌సేతు, బజాజ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కవిత, ఎంపీ సుమిత్ర ఖాన్, ఇండియా యానివర్సిటీ సెక్రటరీ అలోక్ కుమార్ మిశ్రా చేతులు మీదుగా నియామక పత్రం, గుర్తింపు కార్డు అందుకున్నారు.

బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సాయిలాల్ నాయక్



ఆమన్‌గల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కడ్తాల మండలం గోవిందాయిపల్లి తండాకు చెందిన బాణావత్ సాయిలాల్ నాయక్ నియమితుయ్యారు. శనివారం బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు డా.కళ్యాణ్‌నాయక్ నుంచి సాయిలాల్‌నాయక్‌కు నియామకపు ఉత్తర్వులు అందాయి. కాగా, ఆయన ఇంతకుముందు ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా విధులు నిర్వహించారు.

'పది' పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

- డీఈవో సుశీందర్‌రావు

ఆమనగల్లు/మాడ్గుల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి వార్షిక పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుశీందర్‌రావు అధికారులకు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షను శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి పరీక్షల నిర్వహణ తీరు, ఆయా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీటి వసతి, వైద్యశిబిరం, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఎంఈవో పాండు ఆయా పరీక్ష కేంద్రాల సీఎస్‌లు ప్రభాకర్‌రెడ్డి, శ్రీధర్‌లను పరీక్షల నిర్వహణ, విద్యార్థుల హాజరు వివరాలను డీఈవో అడిగి తెలుసుకున్నారు. కాగా, బాలికల ఉన్నత పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా నాగర్‌కర్నూల్ జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని సీసీగా నియమించడం పట్ల డీఈవో స్థానిక సీఎ్‌సలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, సీసీగా నియమించిన ఉపాధ్యాయుడిని శుక్రవారమే రిలీవ్ చేశామని సీఎస్ ప్రభాకర్‌రెడ్డి డీఈవోకు వివరణ ఇచ్చారు. మాడ్గుల మండల కేంద్రంలోని పరీక్ష సెంటర్లను తహసీల్దార్ వినయసాగర్‌తో కలిసి డీఈవో తనిఖీ చేశారు. మండల కేంద్రంలోని ఏ, బీ సెంటర్లను పరిశీలించగా నకలు చీటీలు డీఈవో కంటబడ్డాయి. సెంటర్లలోకి అవి ఎలా వచ్చాయని.. నిర్వాహకులు, పోలీసులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థులను డీబార్ చేస్తామని, నిర్వాహకులపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.



మాడ్గుల : పరీక్ష కేంద్రం వద్ద చీటీలను పరిశీలిస్తున్న డీఈవో సుశీందర్‌రావు

సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు మండల కార్యదర్శి బాల్‌రాజ్ అన్నారు. శనివారం కార్మికులతో కలిసి ఎంఈవో హెచ్. నర్సింహకు వినతి పత్రం అందజేశారు. 24న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. కార్మిక సంఘం మండలశాఖ అధ్యక్షురాలు ప్రభావతి, కార్యదర్శి కె.శ్రీనివాస్ ఉన్నారు.

వేతనాలు చెల్లించాలి

చౌదరిగూడ, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మహాత్మ గాంధీ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఐ మండల కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుర్రంపల్లి, వీరన్నపేట్, జిల్లేడ్‌లో పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. బీకేఎంయూ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చేయించుకోవాలి

కేశంపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తపాలా శాఖ అందిస్తున్న ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా సాంస్కృతిక శాఖ కన్వీనర్ నరేందర్‌రెడ్డి అన్నారు. సంతాపూర్‌లో శనివారం తపాలాశాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత ప్రమాద బీమా పథకాన్ని ఆయన ప్రారంభించారు.

ఇంటిపన్ను సకాలంలో చెల్లించాలి

చేవెళ్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సకాలంలో ఇంటిపన్ను చెల్లించాలని చేవెళ్ల డీఎల్పీవో సతీష్ రెడ్డి తెలిపారు. ఈమేరకు శనివారం మండలంలోని ఆలూర్, ఖానాపూర్, రేగడిఘనాపూర్ తదితర గ్రామాలలో స్థానిక అధికారులతో కలిసి ఆయన ఇంటిపన్ను వసూలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో ఇంటిపన్నుల వసూళ్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. వంద శాతం పన్ను వసూలు చేయాలని గ్రామ కార్యదర్శులకు ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. ఈ సందర్భంగా చేవెళ్ల డివిజన్ పరిధిలోని అన్ని మండలాలవారీగా వసూలు కావాల్సిన పన్నుల వివరాలను ఆయన వివరించారు. ఈనెలాఖరు వరకు మిగిలిపోయిన ఇంటిపన్నులు వసూలు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. గ్రామ కార్యదర్శులు అన్నిగ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పన్నులు వసూలు చేస్తున్నారని చెప్పారు. చేవెళ్ల ఎంపీవో విఠలేశ్వర్, వివిధ గ్రామాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



ఇంటిపన్ను వసూలు చేస్తున్న డీఎల్పీవో సతీష్‌రెడ్డి

మహనీయుల అడుగు జాడల్లో నడవాలి

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భగత్‌సింగ్ స్ఫూర్తితో సామాజిక కార్యక్రమాల్లో యువత భాగస్వాములు కావాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలో పాషా నరహరి స్మారక కేంద్రంలో డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజ్‌గురు వర్ధంతిని నిర్వహించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ప్రజలు ఏనాడూ మరువరన్నారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు పి.జగన్, బి.శంకర్, నాయకులున్నారు. నేటి యువతకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ జీవితాలు స్ఫూర్తిదాయకమని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శివశంకర్ అన్నారు. ఆమనగల్లు పట్టణంలోని మాస్టర్స్ డిగ్రీ కళాశాలలో రాజ్‌గురు వర్ధంతిని నిర్వహించారు.



ఇబ్రహీంపట్నం : రక్తదానం చేస్తున్న యువకులు

సమస్యలు పరిష్కరించాలి

షాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయితీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో యూనియన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, జీతాలు పెంచాలన్నారు. మండల కన్వీనర్ అర్జున్, ఉపాధ్యక్షులు రవి, సురేష్, చిన్న, చంద్రయ్య, రాములు, సాయిలు, యాదమ్మ, తదితరులున్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి తెలిపారు. శంకర్‌పల్లి మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం పాలకవర్గం మొదటి సమావేశం జరిగింది. ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వానికి మధ్య వారదిలా ఉంటూ మార్కెట్ అభివృద్ధికి తోడ్పడతానని తెలిపారు. మార్కెట్ కమిటీ అధీనంలోని గోదాంలో కొనసాగుతున్న వ్యవసాయ కార్యాలయం వారు అద్దె ఇవ్వకుండానే ఉంటున్నారని, అద్దె వసూలు చేస్తే ఆదాయం పెరుగుతుందని సమావేశంలో చర్చించారు. వైస్ చైర్మన్ చంద్రమోహన్, సొసైటీ చైర్మన్ శశిధర్‌రెడ్డి, కార్యదర్శి ఐశ్వర్యలక్ష్మి. డైరెక్టర్లు సుశీల, రవిందర్‌రెడ్డి, యాదిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రశాంత్, సర్తాజ్, మల్లేశం, కిషన్‌నాయక్, రవిందర్‌రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సంతోష్ తదితరులు ఉన్నారు.

'రక్షణ కల్పించండి'

షాద్‌నగర్, మార్చి 22: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కంసాన్‌పల్లిలో ఓ రియల్ వెంచర్‌లో భూవివాదం చెలరేగింది. 11 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి వెంచర్‌ను ఏర్పాటు చేసిన అనంతరం ఈ స్థలం మాదంటూ హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఇటీవల వెంచర్‌లో ఉన్న ప్లాట్ల హద్దు రాళ్లను ధ్వంసం చేశారంటూ వెంచర్ నిర్వాహకుడు నరేందర్‌రెడ్డి శనివారం మీడియాకు వెల్లడించారు. కంసాన్‌పల్లి శివారులో 2012లో 56 ఎకరాలు రైతుల నుంచి కొనుగోలు చేసానని, 2014-2016లో భూములను ప్లాట్లుగా చేసి విక్రయించేందుకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నాలా కన్వర్షేషన్ చేయించుకుని లక్ష్మిగార్డెన్ సిటీ వెంచర్ పేరుతో ప్లాట్లు చేసి విక్రయించానని తెలిపారు. కొందరు స్థలం మాదంటూ ప్లాట్ల హద్దురాళ్లను ధ్వంసం చేసి, స్థలాన్ని కూడా పూర్తిగా చదును చేశారని తెలిపారు. తనవద్ద భూమి కొనుగోలుకు సంబంధించినఅన్ని పత్రాలు ఉన్నాయని వివరించారు. కొందరు వ్యక్తులు మహిళలతో కలిసి తమపై దాడి చేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడుతున్నారని, పోలీసులకు కూడా ఫిర్యాదు చేశానని, దాడులకు పాల్పడ్డ కొందరు వ్యక్తులపై కేసులు కూడా నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. తమకు న్యాయం చేయడంతో పాటు రక్షణ కల్పించాలని నరేందర్‌రెడ్డి కోరారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

షాబాద్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన సంఘటన షాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి కథనం మేరకు.. మండల పరిధిలోని శేరిగూడకు చెందిన చీమల బాల్‌రాజ్(48), బందిల హరిబాబు (55) బైక్‌పై సంకేపల్లిగూడ గేటు నుంచి నాగర్‌గూడకు వెళ్తుండగా మార్గమధ్యలో మల్లారెడ్డిగూడ సమీపంలో మరో వ్యక్తి బైక్‌పై అకస్మాత్తుగా డివైడర్‌ను దాటి బాల్‌రాజ్, హరిబాబు వెళ్తున్న బైక్‌ను బలంగా ఢీకొన్నాడు. దాంతో వారిద్దరికీ తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు అంబులెన్స్‌లో షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే బాల్‌రాజ్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న హరిబాబును ఉస్మానియాకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. హరిబాబు 25 ఏళ్ల క్రితం ఒంగోలు జిల్లా టంగటూరు గ్రామం నుంచి షాబాద్‌కు బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చాడు. మూడేళ్ల క్రితం హరిబాబు భార్య లక్ష్మి షాద్‌నగర్‌లో రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. వారికి ఇద్దరు కుమారులున్నారు. బాల్‌రాజ్ భార్య హంసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా, ఆర్‌అండ్‌బీ అనుమతులు లేకుండా జాతీయ రహదారిపై డివైడర్‌ను తవ్వడంతో ఇద్దరి మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇరు గ్రామాల ప్రజలు ముంబై-బెంగళూరు బైపాస్ జాతీయ రహదారిపై నిరసనకు దిగారు. కొద్దిసేపు ధర్నా చేపట్టారు.

భూ వివాదంలో ఇరు వర్గాలపై కేసు

షాద్‌నగర్ రూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఇరు వర్గాలకు చెందిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం కాంసాన్‌పల్లి గ్రామ శివారులో సర్వేనెంబరు 80,84లోని తొమ్మిది ఎకరాల 20 గుంటలకు సంబంధించి బసిరెడ్డి నరేందర్‌రెడ్డి, రాజేందర్ కుమార్‌లకు వివాదం నడుస్తోందని తెలిపారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. భూ వివాదం పరిష్కారం కోసం సమగ్ర వివరాలు తెలియ జేయాలని ఆర్డీవోకు సిపారసు చేసినట్లు వివరించారు.

వ్యక్తిపై దాడి.. ఒకరి అరెస్టు

యాచారం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పశువుల మేత విషయంలో ఇద్దరు వ్యక్తులు ఘర్షణకు దిగడంతో ఓ వ్యక్తిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీసులు చెప్పారు. ముచ్చర్ల గ్రామానికి చెందిన ఎర్ర మల్లయ్య తన పశువుల మేత విషయంలో అదే గ్రామానికి చెందిన ఎదిరె కృష్ణయ్యపై గొడ్డలికామతో దాడి చేయడంతో ఎదిరె కృష్ణయ్య చేయి విరిగింది. దాంతో కేసు నమోదు చేసి మల్లయ్యను అరెస్టుచేసి రిమాండ్‌కు పంపారు.

నాణ్యతా ప్రమాణాలే 'టయోటా' లక్ష్యం



టయోటా హిలక్స్ బ్లాక్ ఎడిషన్‌ను ప్రారంభిస్తున్న నటుడు నవదీప్

మహేశ్వరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నాణ్యతా ప్రమాణాలే టయోటా కంపెనీ లక్ష్యమని, టయోటా హిలక్స్ బ్లాక్ ఎడిషన్ కారును టయోటా కంపెనీ మన్నిక, నాణ్యత, సౌకర్యం, భద్రతపై రాజీపడకుండా కోరుకునే కస్టమర్ల కోసం రూపొందించిందని సినీహీరో నవదీప్ అన్నారు. శనివారం తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో టయోటా హిలక్స్ బ్లాక్ ఎడిషన్ కారును ఆయన ఆవిష్కరించారు. టయోటా కంపెనీ అధునాతన సాంకేతికతను మిళితం చేస్తూ అనేక కార్లను తయారు చేస్తుందని నవదీప్ అన్నారు. కార్యక్రమంలో హర్ష టయోటా సీఈవో ప్రకృతిక్, మోడి టయోటా గ్రూప్ సీఈవో రంగాచార్యులు, రమణ, సుధీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఆమనగల్లు : మండల కేంద్రంలో జూలూరి రాఘవేందర్ స్మారకార్థం మిత్రబృందం ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరం విజయవంతమైంది. గాంధీచౌక్ వద్ద నిర్వహించిన శిబిరంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జూలూరి రఘవేందర్ చిత్రపటానికి తల్లిదండ్రులు రాధ-నర్సింహ, కుటుంబసభ్యులు రోజా అనంత్, హారికా విక్రాంత్‌తో కలిసి మి త్రులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపిశెట్టి రాము, పాండురంగయ్య, రామ్మోహన్‌గుప్త, తదితరులున్నారు.

ఆమనగల్లు : యూటీఎఫ్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 21వ వర్ధంతిని నిర్వహించారు. కడ్తాల జడ్పీహెచ్ఎస్(బాలుర) యూటీఎఫ్ శాఖ అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వెంకటస్వామి చిత్రపటానికి నివాళులు అర్పించారు.

కందుకూరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల కో-ఆర్డినేటర్ అఫ్జల్‌బేగ్ అన్నారు. నేదునూరు ఆదర్శ పాఠశాల, ఉన్నత పాఠశాలలో రూ.8లక్షల తో చేపట్టే హైమాస్ట్ లైట్లకు పనులకు భూమిపూజ చేశారు. అలయకమిటీ చైర్మన్ రూప్‌చందర్, నాయకులున్నారు.

నందిగామ : మండల కేంద్రంలో పునర్‌నిర్మాణంలో భాగంగా నిర్మించిన అయ్యప్ప ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం నుంచి 26వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలిరోజు శనివారం గణపతి హోమాన్ని వేదపండితుల ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. అనంతరం షాద్‌నగర్‌కు చెందిన వ్యాపారవేత్త ఉప్పల శివకుమార్‌గుప్త ఆర్థిక సహకారంతో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

కొత్తూర్ : సిద్ధాపూర్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి కృష్ణయ్య, ఎంఈవో అంగోర్‌నాయక్‌లు హాజరయ్యారు. విద్యార్థులు భావిభారత పౌరులుగా ఎదిగి గ్రామానికి మంచిపేరు తేవాలన్నారు.

కడ్తాల్ : మండల కేంద్రంలో నూతనంగా మేస్త్రీ సంఘం భవన నిర్మాణం చేపడుతుండగా రాష్ట్ర సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి చేయూతనందించారు. శనివారం కడ్తాల మండల కేంద్రంలో రూ.60వేల విలువ గల సామగ్రిని సంఘం సభ్యులకు అందజేశారు.

ఆమనగల్లు : రాష్ట్ర ప్రభుత్వం మాజీ సర్పంచ్‌లకు రావల్సిన బిల్లులను చెల్లించకుండా నెలల తరబడి కాలయాపన చేస్తోందని రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. రాష్ట్రంలో అందాల పోటీలు నిర్వహించడానికి ఉన్న డబ్బులు.. చేసిన పనులకు చెల్లించేందుకు లేవా? అని ప్రశ్నించారు. కడ్తాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వంలో గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులను సొంత డబ్బులతో చేపట్టడం జరిగిందన్నారు. అప్పులకు మిత్తీలు చెల్లించలేక సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీ సర్పంచ్‌లు హరిచంద్ నాయక్, సులోచన సాయిలు, చైర్మన్ వెంకటేష్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, జోగు వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యశిబిరం నిర్వాహకులు శామ్యూల్, హర్షిత పోచంపల్లిలు తెలిపారు. శేరిగూడలో ఇండస్ ఇంటర్ నేషనల్ స్కూల్, మెడికవర్ ఆసుపత్రి, రెనోవా ఆసుపత్రిల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 9మంది వైద్యులు 300మంది రోగులను పరీక్షించి మందులు అందించారు.

షాద్‌నగర్ అర్బన్ : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మ గుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ పల్లకీసేవ నిర్వహించారు. ప్రత్యేక పూజలు తరువాత ఉత్సవ విగ్రహంతో పల్లకీసేవ కొనసాగించారు. మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.